రైతు పండుగను జయప్రదం చేద్దాం

- పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



హన్వాడలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న మాజీ సర్పంచ్ గోపాల్

హన్వాడ: జిల్లా కేంద్రంలో శనివారం జరిగే రైతుపండగ కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన స్థానిక ప్రెస్‌క్లబ్‌లో కాంగ్రెస్ కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని అన్నారు. త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభిస్తున్నట్లు వివరించారు. వచ్చే పంచాయతీ ఎన్నికల్లో మండలంలోని అన్ని పంచాయతీల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలని కార్యకర్తలకు సూచించారు. మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ గోపాల్ టీడీపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే సమక్షంలో చేరారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు సురేందర్‌రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ సిరాజ్‌ఖాద్రి, ఎన్పీ వెంకటేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ విజయ్, మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్, డీసీసీ కార్యదర్శి కృష్ణయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

కోయిల్‌కొండ: రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని ఆపార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రైతుపండుగ సభకు మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు. మండలం నుంచి 1500బైకులు, 15 బస్సులు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. నాయకులు సత్యపాల్‌రెడ్డి, రవినాయక్, శేఖర్, రామస్వామి, శ్రీనువాసులు, దిలీప్ పాల్గొన్నారు.

రైతు పక్షపాతి కాంగ్రెస్

గండీడ్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని ఉమ్మడి మండలం పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, గండీడ్, మహమ్మదాబాద్ మండలాల అధ్యక్షులు జితేందర్‌రెడ్డి, కేఎం నారాయణ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. ఏప్రభుత్వం చేయలేని విధంగా మూడురోజుల పాటు మహబూబ్‌నగర్‌లో రైతు పండుగను ఘనంగా నిర్వహిస్తుందన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి ప్రధాన కార్యదర్శి పుల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ బాలయ్య, మాజీ సర్పంచ్‌లు లక్ష్మారెడ్డి, గోపాల్, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఈసా, శంకరయ్య, లింగన్న శివ తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: జిల్లా కేంద్రంలో శనివారం జరిగే రైతు సభను విజయవంతం చేద్దామని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాంచంద్రయ్య, రాజేష్, అజహర్ పిలుపునిచ్చారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ సభకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని వారు కోరారు.

బొటానికల్ గార్డెన్‌లో శిక్షణ అధికారులు



గార్డెన్‌లో మొక్కకు నీళ్లు పోస్తున్న శిక్షణ అధికారుల బృందం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని డా.బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌ను శిక్షణ అధికారుల బృందం శుక్రవారం సందర్శించింది. అక్కడ మొక్కలకు నీళ్లు పోశారు. గార్డెన్ సందర్శనకు వచ్చిన అధికారుల బృందంలో పారుల్ సింగ్, ఆదిత్యరాజ్, యశ్ సురేకుమార్ కాలె, హరిప్రశాంత్, మాన్సి రాజీవ్ గోఖలెలకు వైస్ ప్రిన్సిపాల్ డా.నర్మద పూలబొకేతో స్వాగతం పలికారు. గార్డెన్ సమన్వయకర్త డా. సదాశివయ్య గార్డెన్‌లోని వివిధ విభాగాలను చూయించారు. గార్డెన్‌తోపాటు జీవ వైవిధ్య పరిశోధన కేంద్రం, విద్యాకేంద్రాన్ని సైతం సందర్శించారు. జడ్చర్ల పరిసరాల్లో పట్టుకువచ్చిన పాములను, వాటిని సంరక్షిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు.

బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేత



బీమా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట: మండలంలోని కురుమూర్తి గ్రామానికి చెందిన మహేష్ కొన్నిరోజుల క్రితం విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. అందుకు విద్యుత్ శాఖ నుంచి రూ.5లక్షల బీమా చెక్ వచ్చింది. ఈ చెక్కును శుక్రవారం మండలంలోని దమగ్నాపురం గ్రామంలో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మహేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ సంతోష్, కురుమూర్తి గ్రామస్తులు కథలప్ప, బాలస్వామి ఉన్నారు.

దీక్షా దివస్‌కు బీఆర్‌ఎస్ నాయకులు



దీక్షా దివస్‌కు బయలు దేరిన గండీడ్, మహమ్మదాబాద్ మండలాల బీఆర్‌ఎస్ నాయకులు

నవాబుపేట: దీక్షా దివస్‌కు శుక్రవారం మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు నర్సింహులు, మాజీ జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ లక్ష్మయ్య, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గోపాల్ గౌడ్, అబ్దుల్లా, శ్రీనివాస్, అంజయ్య పాల్గొన్నారు.

గండీడ్/మహమ్మదాబాద్: వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న దీక్షా దివస్ సదస్సుకు గండీడ్, మహమ్మదాబాద్ మండలాల బీఆర్‌ఎస్ నాయకులు తరలివెళ్లారు. శుక్రవారం గండీడ్ మండలంలోని వెన్నాచేడ్, గండీడ్, కొంరెడ్డిపల్లి, పంచాంగల్ తండా, పెద్దవార్వాల్, రెడ్డిపల్లి, సల్కర్‌పేట్, జిన్నారం, మహమ్మదాబాద్ మండలం నుంచి నంచర్ల, గాధిర్యాల్, మొకర్లాబాద్, వెంకట్‌రెడ్డిపల్లి , మంగంపేట్ , చౌదర్‌పల్లి గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు వెళ్లారు. అక్కడికి వెళ్లిన వారిలో మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ అధ్యక్షులు పెంట్యానాయక్, బిక్షపతి, ఆర్‌ఎస్‌ఎస్ మాజీ అధ్యక్షుడు గోపాల్, పీఏసీఎస్ డైరెక్టర్లు వెంకటయ్య, రాంరెడ్డి, మాజీ సర్పంచులు రాజేశ్వర్, రఘు, నీలేష్, మాజీ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, నర్సప్ప, తిర్మల్‌రెడ్డి కాశీనాథ్‌రెడ్డి, కామి వెంకట్ రాములు ఉన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



కోయిల్‌కొండలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

కోయిల్‌కొండ: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ అని ఎంఈఓ వెంకటాజీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉన్నతపాఠశాలలో మండల స్థాయి గణిత ప్రతిభ పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని చంద్రాస్‌పల్లి, వింజామూర్, గార్లపహాడ్, కేజీబీవీ, కోయిల్‌కొండ ఉన్నతపాఠశాలల విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. ఈ పరీక్షలు తెలుగు మీడియంలో ప్రథమ బహుమతి కల్పన వింజామూర్, ద్వితీయ ప్రీతి (కేజీబీవీ), తృతీయ కిషోర్ గార్లపహాడ్ పాఠశాలల విద్యార్థులు విజేతలు. ఇంగ్లీషు మీడియంలో శ్రీకాంత్, చందునాయక్, అక్షయ్‌లు విజేతలుగా నిలిచినట్లు ఆయన తెలిపారు. విజేతలలకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు.

విద్యార్థులకు ప్రతిభ పోటీ పరీక్షలు

నవాబుపేట: గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని వివిధ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ప్రతిభ పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంగ్లీష్ మీడియంకు సంబంధించి కొల్లూర్ పాఠశాల మొదటి స్థానం, నవాబుపేట, యన్మన్‌గండ్ల జడ్పీ పాఠశాలలు రెండు, మూడు స్థానాలు సాధించాయి. తెలుగు మీడియంలో మొదటి మూడు స్థానాలు ఇప్పటూర్ జడ్పీ పాఠశాల కైవసం చేసుకుంది. ట్యాలెంట్ టెస్ట్‌కు మండలం నుంచి ప్రత్యేకంగా ఎంపిక చేసిన 41 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగ్యనాయక్, జనార్దన్, కృష్ణయ్య, దశరథ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

అడ్డాకుల: మూసాపేట మండలం వేముల స్టేజీ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. కందూర్‌కి చెందిన రాఘవేందర్ మూసాపేట సమీపంలోని విభా సీడ్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఉదయం ద్విచక్రవాహనంపై మరో యువకుడితో కలిసి డ్యూటీకి వెళ్తున్నాడు. వేముల స్టేజీ వద్ద కర్నూల్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బైక్‌ను ఢీకొంది. బైక్‌పై ఉన్న ఇద్దరు కిందపడిపోయారు. ఇద్దరిలో రాఘవేందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన బస్సును డ్రైవర్ నిలుపకుండా తప్పించుకు వెళ్లాడు. స్థానికులు బైక్‌లపై బస్సును వెంబడించారు. భూత్పూర్ మండలం పోతులమడుగు సమీపంలో బస్సును నిలిపి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసుల ఆదేశంతో బస్సు డ్రైవర్ బస్సును మూసా పేట పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చాడు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

మాలల సింహగర్జనకు తరలిరావాలి

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే సింహగర్జన సభకు మా లలు లక్షలాదిగా తరలిరావాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర కోఆర్డినేటర్ బ్యాగరి వెంకటస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ నేతృత్వంలో అక్టోబర్ 25న భద్రాచలంలో చేపట్టిన మహా పాదయాత్ర డిసెంబర్ 1న ముగుస్తుందని తెలిపారు. జిల్లాఅధ్యక్షుడు చిన్న, నాయకులు దాసు, ఆంజనేయులు, రవికుమార్, సత్తయ్య, వెంకట్రాములు, రామచంద్రయ్య, శ్రీనివాస్, యాదగిరి, శేఖర్, ఆనంద్, మహేందర్, తిరుపతయ్య పాల్గొన్నారు.

'సింహగర్జనకు వెళ్లొద్దు'

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబర్ 1న మాలలు నిర్వహిస్తున్న సింహగర్జన సభకు మాదిగలు, మాదిగ ఉప కులాలు, ప్రజాస్వామికవాదులు వెళ్లొద్దని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నర్సిములు, రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అంబేద్కర్ కళాభవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత కూడా మాలలు కోర్టు తీర్పును ధిక్కరిస్తూ సింహగర్జన సభ నిర్వహిస్తున్నారని అన్నారు. వర్గీకరణ విషయంలో కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని, సీఎం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు వెంకటయ్య, నాయకులు రాములు, ఆశన్న, రాజు పాల్గొన్నారు.

నేత్రదానం



భాగ్యమ్మ (ఫైల్)

జడ్చర్ల టౌన్: పట్టణంలోని బండారు భాగ్యమ్మ (65)అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు ఆమె కన్నులను దానం చేశారు. ఈ మేరకు జిల్లా లయన్ నటరాజ్ ద్వారా ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి సమాచారం అందించారు. టెక్నీషియన్ శివ వచ్చి మృతురాలి నుంచి కార్నియా సేకరించారు. కార్నియా సేకరించినట్లుగా మృతురాలి భర్త అచ్యుతారెడ్డికి ధృవపత్రాన్ని అందజేశారు. లయన్ ఈశ్వర్, దత్తుకుమార్, కైలాష్ జవహర్, ఫరీద్ తదితరులున్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



రాజాపూర్‌లోని కస్తూర్బా పాఠశాలలో కూరగాయలను పరిశీలిస్తున్న ఎంఈఓ సుధాకర్



దేవరకద్ర: విద్యార్థుల భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రాజాపూర్: విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చిన మెనూతోపాటు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ సుధాకర్ పేర్కొన్నారు. శుక్రవారం రాజాపూర్ శివారులోని కస్తూర్బాగాంధీ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటశాల, అక్కడి ఉపయోగిస్తున్న కూరగాయలను పరిశీలించారు. భోజనం ఎలా ఉందంటూ విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీలో కొన్నేళ్లుగా వందశాతం ఉత్తీర్ణత సాధించడంతో ప్రిన్సిపాల్ పావనితో పాటు ఉపాధ్యాయురాళ్లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఉత్తీర్ణత ఇలాగే కొనసాగాలన్నారు. పదిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థినులకు బహుమతి అందిస్తామని అన్నారు.

బియ్యంలో రాళ్లు లేకుండా చూడాలి

దేవరకద్ర: విద్యార్థులకు అందించే బియ్యంలో రాళ్లు, పురుగులు లేకుండా చూడాలని వంట ఏజెన్సీ, సిబ్బంది ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ బలరాం ఆదేశించారు. స్థానిక మైనార్టీ గురుకుల పాఠశాలను శుక్రవారం వారు సందర్శించారు. ఈసందర్భంగా మధ్యాహ్నం విద్యార్థులకు అందించిన భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులు భోజనాలు ముగించే వరకు అక్కడే ఉండి పర్యవేక్షించారు. వంట గదిని, వంట పాత్రలను పరిశీలించారు. విద్యార్థుల కోసం స్టాక్ చేసిన బియ్యం, ఇతర సామాన్లను వారు తనిఖీ చేశారు.

వంటశాలలు పరిశుభ్రంగా ఉంచుతున్నారా?

గండీడ్/మహమ్మదాబాద్: పాఠశాలల్లో వంట శాలలు శుభ్రంగా ఉంచుతున్నారా.. లేదా అని కాంగ్రెస్ నాయకులు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం గండీడ్, మహమ్మదాబాద్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జితేందర్‌రెడ్డి, కేఎం నారాయణ, నాయకులు కలిసి గండీడ్ మండలంలోని సల్కర్‌పేట్ మినీ గురుకులం, మహమ్మదాబాద్ కేజీబీవీ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. స్టోర్‌లో ఉన్న కూరగాయలు తాజాగా ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం ఎలా ఉంది, నీటి వసతిని అడిగి తెలుసుకున్నారు. పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుల్లారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్లు శ్రీనివాస్‌రెడ్డి , విష్ణువర్ధన్, మాజీ ఎంపీటీసీ బాలయ్య, మాజీ కోఆప్షన్ ఈసా పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 32వ వార్డు పరిధిలోని మక్కా మసీదు ప్రాంతంలో శుక్రవారం సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్ కుమార్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వివిధ వార్డుల్లో అభివృద్ధి పనుల కోసం రూ.60లక్షలు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సాదతుల్లా, నాయకులు హాది, జాకీర్ పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేకపూజలు



దేవరకద్ర: పూజలు చేస్తున్న భక్తులు

జడ్చర్ల టౌన్: స్థానిక 24వ వార్డులోని ఎల్లమ్మ ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని భక్తులు దీపాలు వెలిగించారు. శుక్రవారం అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు. వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పంచామృతాభిషేకం, వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ చేశారు.

దేవరకద్ర: వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం పలువురు దంపతులు అమ్మవారికి పూజలు చేశారు. నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చన, లలితా సహస్ర నామార్చన, పల్లకీసేవ నిర్వహించారు.

నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన



దేవరకద్ర ఎమ్మార్సీ కార్యాలయం ముందు సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన

దేవరకద్ర: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ముందు శుక్రవారం సమగ్ర శిక్షా ఉద్యోగులు నిరసన తెలిపారు. భోజన విరామ సమయంలో ఉద్యోగులంతా బయటకొచ్చి నల్ల బ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌గౌడ్, ఉద్యోగులు రాధిక, అనురాధ పాల్గొన్నారు.

ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



చిన్నచింతకుంటలో..

చిన్నచింతకుంట: సమగ్ర శిక్షాలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగులు ప్రవీణ్, జయసింహ డిమాండ్ చేశారు. శుక్రవారం చిన్నచింతకుంట మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం వద్ద సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలీచాలని వేతనంతో ఎనో ఏళ్లుగా పనిచేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులరైజ్ చేయాలని పలుమార్లు సమ్మెలు చేపట్టామన్నారు. వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి సమగ్రశిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్‌కు విద్యార్థుల ఎంపిక

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రాజేశ్వర్‌రెడ్డి, పీడీ సుగుణ తెలిపారు. 9వ తరగతికి చెందిన విద్యార్థులు వెంకటరమణ, అంజలి, శిరీష జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చారు. రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. డిసెంబర్ 7నుంచి 9 వరకు మూడు రోజుల పాటు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులు శివశరనప్ప, గోవర్ధన్‌రెడ్డి, నాగార్జున, నరసప్ప, శివరాజు, సతీష్, సత్యయ్య, శోభారాణి, అరుణ, గీతజ్ఞాన, మధు, స్వాతి ఉన్నారు.

బీసీ మహిళల వాటా తేల్చాలి

- బీసీ ఐక్యవేదిక మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పుష్పలత



మాట్లాడుతున్న పుష్పలత

మహబూబ్‌నగర్ రూరల్: మహిళా రిజర్వేషన్లు కేటాయిస్తున్న ప్రభుత్వాలు బీసీ మహిళల వాటా తేల్చాలని తెలంగాణ బీసీ ఐక్యవేదిక మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పుష్పలత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధ్యారాణి అధ్యక్షతన బీసీ మహిళా సాధికారత సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పుష్పలత మాట్లాడారు. మహిళా సాధికారత పోరాటంలో బీసీ మహిళలు ముందున్నారని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లలో మహిళలకు ఇవ్వడం కాకుండా జనరల్ మహిళా రిజర్వేషన్‌లో బీసీ మహిళల వాటా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. జనాభాలో 54 శాతం బీసీలు ఉన్నారని, అందులో 27 శాతం మహిళలు ఉన్నారని తెలిపారు. ఉద్యోగ, ఉపాధి, రాజకీయ, రాజ్యాంగబద్ధ హోదాల్లో బీసీ మహిళలకు అవకాశాలు కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు ఇస్తున్న అన్ని రిజర్వేషన్లలో 50శాతం వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. నారాయణమ్మ, ఎం.చంద్రకళ, ఎ.స్వామి, అనురాధ, ఎం.స్వాతి, కె.వీణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

జడ్చర్లలో హిందూ చైతన్య రథయాత్ర



జడ్చర్ల టౌన్: ధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన హిందూ చైతన్య రథయాత్ర శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలో కొనసాగింది. బూర్గుపల్లి, కిష్టంపల్లి, నాగసాల గ్రామాలతో పాటు పట్టణంలోని పాతబజార్, ఇందిరానగర్ కాలనీల్లో రథయాత్ర ఊరేగింపు జరిగింది. యాత్ర పురస్కరించుకుని భజనలు, కోలాటాలతో స్వాగతం పలికారు. సంస్కృతి, సంప్రదాయాలు, సంస్కారం పెంపొందించటానికి ధర్మ జాగరణ సంస్థ రథయాత్ర చేపట్టిందని సంస్థ ప్రముఖ్ లవకుమార్ అన్నారు. వీహెచ్‌పీ నాయకులు జైపాల్‌రెడ్డి, బక్క రాజేష్, గుబ్బ నర్సింహులు, విజయకుమార్, శ్రీను, కృష్ణయ్య, లావణ్య, ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖులు సురేష్, శ్రీకాంత్‌చారి, సంస్కార భారతి సభ్యుడు రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన డీసీఎం

- ఇద్దరికి గాయాలు



నవాబుపేట: ఆర్టీసీ బస్సును డీసీఎం ఢీకొట్టగా ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం మండలంలోని కాకర్‌జాల్ గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. మండలంలోని కాకర్‌జాల్ గ్రామ సమీపంలో మలుపు వద్ద నవాబుపేట నుంచి షాద్‌నగర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా వస్తున్న డీసీఎం ఢీకొట్టింది. దీంతో బస్సు ముందు భాగం ధ్వంసమైంది. బస్సు డ్రైవర్ అప్రమత్తంగా ఉండటంతో పెనుప్రమాదం తప్పింది. ఘటనలో వైష్ణవి, జమిలీ అనే ఇద్దరు ప్రయాణికులకు గాయాలయ్యా యి. వారిని ఆసుపత్రికి పంపించి బస్సు డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

విద్యార్థులకు అభినందనలు

జడ్చర్ల టౌన్: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో మంచిర్యాలలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పట్టణంలోని ప్రేరణ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ గోపినాథ్ తెలిపారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో ఆవిద్యార్థులను అభినందించి మంచిర్యాలకు పంపించారు. అండర్–8 400 మీటర్ల పరుగు పందెంలో షహజాద్, అండర్–10 400మీటర్ల పరుగు, లాంగ్‌జంప్‌లో అరవింద్ ఎంపికయ్యారన్నారు. మహబూబ్‌నగర్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–14రగ్బీ పోటీలకు రేహాన్ ఎంపికయ్యాడు.

డీఏను విడుదల చేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం పంచాయతీ రాజ్ ఎన్నికల కంటే ముందే డీఏలను విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమగ్ర శిక్షా ఉద్యోగులకు టైంస్కేల్ ఇవ్వాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు హెల్త్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యదర్శి తాహేర్, ఆంజనేయులు, నాగేంద్రం పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ నూతన కమిటీ

మిడ్జిల్: టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీని శుక్రవారం ఎమ్మార్సీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నట్లు ఆయూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ తెలిపారు. అధ్యక్షుడిగా వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా రమేష్‌ను ఎంపిక చేశారు. ఈ సందదర్భంగా వెంకటేష్ మాట్లాడారు. ఎంఈఓ సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహులు, జానకమ్మ, కోట్యా, శ్రీలత, కృష్ణమ్మ, ప్రభావతి, శిరీష, మంజుల తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

హన్వాడ: బహిర్భూమి కని వెళ్లిన ఓ వివాహిత మహిళ అదృశ్యమైంది. ఈ సంఘటనపై భర్త ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. మహమ్మదాబాద్ మండలం చిన్నాయపల్లికి చెందిన అనిత, భర్త చెన్నయ్యతో కలిసి ఈనెల 23న హన్వాడ వైద్యంకోసం వచ్చింది. వైద్యపరీక్షల అనంతరం అనిత బహిర్భూమికని వెళ్లి అదృశ్యమైంది. భర్త బంధువుల ఇళ్లలో వెతికినా ప్రయోజనం లేదు. భర్త పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్‌ఎన్‌ఆర్ ధర రూ.2,662

దేవరకద్ర: స్థానిక మార్కెట్‌యార్డులో శుక్రవారం జరిగిన టెండర్లలో ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,662, కనిష్టంగా రూ.2,059గా లభించాయి. హంసధాన్యం ధర గరిష్టంగా రూ.2,061, కనిష్టంగా రూ.2,011గా నమోదయ్యాయి. మార్కెట్‌కు దాదాపు వేయి బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.